# 4 పగటి నక్షత్రాలు

హఠాత్తుగా సుజాత జ్ఞాపకం వొచ్చి చూశాను. ఆమె శ్రీమతి మాథుర్‌తో సోఫాలో కూర్చుని ఏదో మాట్లాడుతూంది. ఇంత సేపటినించీ ఆమె జ్ఞాపకంరాని విషయం గుర్తుకి వొచ్చి నేరస్థుడిలాగ బాధపడ్డాను. ఎదురుగా కూర్చున్న గీత చూడకుండా నెమ్మదిగా గడియారం చూశాను. భగవాన్! పదకొండున్నర! గీత చెప్తూన్నది ఆపి నన్ను గమనిస్తూంది, చిరునవ్వు నవ్వుతూ.

"ఏమిటి అన్నారు మీరు?" అన్నాను కొంచెం గాభరాపడి.

కిలకిల నవ్వి, "అదికాదు మీరడగాల్సింది....సుజాత ఏమిటన్నారు?" అంది గీత.

"ఆమెతో...."

"మీరు మాట్లాడలేదు.... చెలిపతీ."

"చాలా రాత్రి ఐపోయింది. మీకూ ఈ రోజు అలసటగానే ఉంటుంది గీతా! ఇంక వెడతాము" అన్నాను లేస్తూ.

గీత సుజాత వైపుచూసి మళ్ళీ నవ్వుతూ, "అవును-చాలా రాత్రి ఐపోయింది. కాలగమనమే తెలియలేదు! కాని, నాకు ఈరోజు ఎంతో ఆనందంగా గడిచిపోయింది!" అంది.

"నాకూనూ-ధన్యవాదాలు."

మాధుర్‌కోసం చూశాను. అతనెక్కడా కనిపించలేదు. మేము లేచి నిలబడ్డం చూసి మిసెస్ మాధుర్, "ఆయన పిల్లల్ని నిద్ర పోతున్నారో లేదో చూసేందుకు వెళ్ళారు—అదిగో! వొస్తున్నారు... వెళ్ళిపోవాలి?" అంది లేచి నిలబడి.

"ఇంకా అర్ధరాత్రి కాలేదు-బ్రదర్! మా పెద్దవాడికి నిద్ర రాక పోతే కథ చెప్పి వొచ్చేను—"

"అంటే-వాడికి తెల్లవార్లూ నిద్రరాదన్న మాట!" అంది మళ్లీ నవ్వుతూ గీత.

"పోనీ, నువ్వు వెళ్ళి జోలపాట పాడు" అన్నాడు మాధుర్.

"ఇంట్లో ఇంకెవరికీ నిద్ర రాకుండానా?" అంది శ్రీమతి మాధుర్.

అందరం నవ్వుకున్నాం.

పరస్పరం సెలవు తీసుని బయటికి వొచ్చాము. డిసెంబర్‌నెల —చిక్కటిచలి గడగడ వొణికించేస్తుంది. జేబులోనుంచి గ్లవ్స్ తీసి తొడుక్కున్నాను. స్టీరింగ్ వీల్ తలుచుకుంటేనే వేళ్ళు కొంకర్లు పోతున్నాయి.

మాధుర్ దంపతులూ, గీతా వొద్దంటున్నా బయటికి వొచ్చేరు. కూర్చుని స్టార్టర్ లాగేను....కాని, నీరసంగా చిన్న మూలుగుమాత్రం వచ్చింది ఇంజన్‌నించి.

ఛోక్‌తో మళ్ళీ ప్రయత్నించేను. కాని, ఏమీ లాభంలేక పోయింది. చాలా కాలంనించి అనుకుంటున్నాను బేటరీ మార్చాలని, రెండేళ్ళైపోయింది బేటరీకొని.

"హేండిల్‌తో ప్రయత్నించండి" అంది సుజాత.

ఆ నిమిషంలో చాలా కోపం వొచ్చింది ఆమెమీద. తానేమో శాల్ గట్టిగా కప్పుకుని కూర్చుంది. గత్యంతరం ఉందని కాదు; కాని, ఆమె అనడం ఎందుకు?

స్టార్టింగ్ హేండిల్ తీసుకుని బయటికి దిగేసరికి మాధుర్ వొచ్చి, "కూర్చో బ్రదర్! సిపాయి ఉన్నాడు. ఇద్దరం కాస్త

తోస్తాం ఇవేళకి- రేపు బేటరీ కొంటానని వొట్టు మాత్రం వెయ్యి!"
అన్నాడు.

ధన్యవాదాలు చెప్పి మళ్ళీ కూర్చుని, అందరికీ సమస్తే చెప్పి కారు కదలడంకోసం ఎదురుచూస్తూ కూర్చున్నాను. పోర్టికో మెట్ల మీద నిలబడిన గీత కనిపించి నవ్వుతూ ఆమె వైపు చూశాను. ఆమె చెయ్యి ఊపింది- నేనూ ఊపేను.

కారు కదిలింది. గేటుదాటే దాకా స్టార్టు కాలేదు, గేర్‌లో పెడితే కోపం వొచ్చినట్లు చిన్న గెంతుగెంతడం తప్ప. నాకు అభిమానంతో చెమట పోసేస్తూంది, మాధుర్‌ని తలుచుకుని.

చివరికి కారు స్టార్ట్ ఐంది.

అతనికి క్షమాపణలు చెప్తూంటే పరిగెట్టుకుని వొచ్చి. "'కార్పెట్ బేగర్స్' ఇవ్వడం మరిచిపోయేను. తీసికెళ్ళండి" అని పుస్తకం నాకిచ్చి 'బై' అంటూ లోపలికి వెళ్ళిపోయింది గీత.

నెమ్మదిగా ముందరికి సాగేను. విండ్ షీల్డునిండా మంచుతుంపరలు. రుమాలుతో లోపల తుడిచినా మసకగానే ఉంది. లైట్లూ గొప్పగా లేవు. కాని, కారు ఆపి బయట అద్దంతుడిచే ధైర్యంలేదు. వీధి దీపాల సాయంతో ఎక్కడా చలనంలేని రోడ్డుమీద ధైర్యంతో సాగేను.

మరో మైలుదాకా సుజాత మాట్లాడలేదు.

"సారీ- చాలా ఆలస్యం అయిపోయింది" అన్నాను, ఏదైనా అని ఆ విచిత్రమైన శీతల నిశ్శబ్దాన్ని మాయం చేద్దామని.

ఆమె మాట్లాడలేదు.

మరో ఫర్లాంగు నిశ్శబ్దం తరవాత "చాలా చలిగా ఉంది!" అన్నాను.

జవాబుగా సుజాత కిటికీ అద్దం మరికొంచెం అంగుళాలు కిందికి దించి శాల్ తలనిండా కప్పుకుంది.

"వేళ్ళు వంకర్లు పోతున్నాయి" అన్నాను.

నిశ్శబ్దంగా కార్పెట్ బేగర్స్ తీసి నా వేళ్ళకి ఓసారి తగిలించి మళ్ళీ కిందని పెట్టింది.

ఈద్గాం చేరేసరికి గండం గడిచినంత సంతోషం కలిగింది. రేపు బేటరీ మార్చాలి అనుకుంటూ సుజాతని పోర్టికిలో దింపి, కారు గరాజ్‌లో పెట్టి త్వరగా లోపలికి నడిచాను.

మీదికి వెళ్ళేసరికి సుజాత హీటర్ ఆన్‌చేసి తన గదిలోకి వెళ్ళి పోయింది. నేనూ బట్టలు మార్చుకుని వొచ్చేను. ఎంతో హాయిగా ఉంది వేడి చేతులకి....కాని వీపుకి బలే చలి వేస్తోంది.

మరో పదినిమిషాల తరవాత సుజాత రెండు గ్లాసుల్లో హార్లిక్స్ తెచ్చి "కావాలా?" అంది.

తీసుకుంటూ, "సందేహం ఎందుకు?" అన్నాను.

"ఈ రోజు మీలో దేనికీ ఖాళీ ఉంటుందనుకోలేదు."

"అంత భోజనం చెయ్యలేదు."

"చూశాను-తినలేకపోయారు....నేనన్నది అదికాదు."

"మరి?" అని, నాలిక కొరుక్కున్నాను. ఇలాటి ప్రశ్నలెంత మూర్ఖంగా వుంటాయో, అంత త్వరగా ఊడిపడతాయి.

"గీత-చాలా చాలా అందంగా వుంటుంది కాదూ?"

నా పక్కనే కూర్చుని చేతులు వెచ్చ చేసుకుంటూ, మెల్లి చిరునవ్వుతో నా కళ్ళలోకి చూస్తూ అంది సుజాత.

ప్రమాద చిహ్నాలు గుర్తించి నెమ్మదిగా ఆమెని దమాత్రం తీసుకుంటూ, "ఫరవాలేదు - అంత గొప్పగా కాదు కాని....' బోయాను.

సుజాత నా చేతిని నాకు వొప్పజెప్పి కొంచెం జరిగి కూర్చొని దగ్గరగా "నిజం చెప్పండి! అంత అందమైన అమ్మాయిని ఎప్పుడైనా చూశారా?" అంది, నా హార్లిక్స్ ఇస్తూ.

"ఆఁ...." అన్నాను. "అందం చూసేవాళ్ళ కళ్ళల్లో ఉంటుబ్బంది, నన్నామె అంత ఇంప్రెస్ చెయ్యలేదు."

పక్క గదిలో టెలిఫోన్ పిలిచింది.

వెళ్ళేను. అక్కడినించి మాధుర్ క్షేమంగా చేరేనని తెలుసు

కోడానికి పిలిచేడు. జవాబు విని, "నీ సిగరెట్ లైటరు మరిచి పోయావు—రేపు తెస్తాలే" అని చెప్పి ముగించేడు.

సుజాత కిటికీ దగ్గిర నిలబడి రాత్రిలోకి చూస్తూంది.

"నిద్ర రావడంలేదా?" అన్నాను.

"అదేవొస్తుంది. ఫోన్ ఏమిటి?"

చెప్పేను.

"ఆమె ఎంతో తియ్యగా మాట్లాడుతుంది కాదూ?"

"అదొక నేర్పు—కృత్రిమంగా...."

చివాలున నావైపు తిరిగింది సుజాత. ఒక్కసారి ఆమెకి చాలా కోపం వొచ్చింది.

"అబద్ధాలు చెప్పేవాళ్ళంటే నాకు చాలా—"

"చెప్పు—"

"అసహ్యం!"

వొత్తి అని ఆమె బెడ్‌రూమ్‌లోకి వెళ్ళిపోయింది—మరో పదినిమిషాలు ఆమె ప్రవర్తన గురించి ఆలోచించేను. అంతుదొరక లేదు. సుజాతలో చాలా విచిత్రమైన లక్షణాలు ఉన్నాయి. నన్నామె ప్రాణంకన్నా ఎక్కువగా చూచుకుంటుందని తెలుసును. ఆమెకి కోపం ఎక్కువ....ఎవరినీ లక్ష్యం చెయ్యదు, నాతో కలిపి. కాని, ఆమెకి నామీద విశ్వాసం పూర్తిగా వుంది. జెలసీకి ఆమెలో తావు లేదనీ నాకు తెలుసును.

గీతతో నేను మాట్లాడ్డం ఆమెకింత కోపం తెప్పించదని నాకు తెలుసును. ఆమె సుజాతకి మరీదగ్గిర.

అందుచేతనే ఆశ్చర్యం వేసింది నాకు.

కొంచెం కోపంకూడా వొచ్చింది. కాని, మరుక్షణంలో అది మాయం ఐపోయింది. ఆమెది చాలా విషయాల్లో చిన్నపిల్లలాటి మనస్తత్వం. సుళువుగా దెబ్బతింటుంది. అదీకాక, నాదగ్గిర సుజాత ఉన్నది దాచడంగాని. లేనిది చూపడంగాని చెయ్యదు.

హీటర్ ఆఫ్‌చేసి లోపలికి వెళ్ళేసరికి ఆమె నేను తెచ్చిన నవలలో కాగితాలు తిరగవేస్తూంది.

క్విల్ట్‌లో దూరి నా మంచంమీద పడుకున్నట్టు ఉంది పది నిముషాలైతే కాని వెచ్చదనం రాదు.

కొంచెంసేపు ఆమె మాట్లాడుతుందని చూసి, ఆమె పుస్తకం మీద చూపిస్తున్న ఏకాగ్రతకి ఆశ్చర్యపడి, "ఇంకా చదువుతున్నావా?" అన్నాను.

"ఏం? మీకు కావాలా?"

"వొద్దు—దీపం తీసేస్తే నిద్రపోదామని."

"తొందర ఏమిటి?"

"రేపు ఉదయం బయటికి వెళ్ళాలి."

"ఎక్కడికి?"

"బహుశా ఫిరోజాబాద్ వెడతాను."

ఆమె పుస్తకం టేబిల్‌మీద పడేసి టేబిల్‌లైట్ ఆఫ్ చేసింది. మరో ఐదు నిమిషాలలాగే, చలిలో, చీకటిలో నిశ్శబ్దంలో గడిచి పోయాయి. క్రమంగా వెచ్చబడుతోంది క్విల్టు కింద.

"నిద్రరావడంలేదా?" అన్నాను, ఆమె నిద్రపోవడంలేదన్న తెలిసి.

"అదేవొస్తుంది—మీరు నిద్రపోతే."

"ఇంకా కోపం పోలేదా?"

"లేదు."

"ఎందుకని వొచ్చింది?"

"చెప్పానుగా! నాకు అబద్ధాలంటే—"

"అసహ్యం!" అన్నాను.

"అవును."

"నేనాడిన అబద్ధాలేమిటి?"

"తెలియనట్టు మాట్లాడకండి—గీత గొప్ప అందంగా లేదని ఎందుకన్నారు?"

"అలాగ అనుకున్నాను కనక...."

"అదే గిల్టీకాన్షన్స్....మీరు ఆమెని వొదిలివొచ్చే పరిస్థితిలో కూడా లేరు అక్కడ!"

"అది అబద్ధం!"

"కాదు—చివరకి మీ కారుకూడా మీలాగే...."

ఆమె నవ్వింది.

ఈ అధ్యాయం అయిపోయిందని అనుకున్నాను.

కాని, మరుక్షణంలో, "ఆమె గొంతుక కూడా ఎంతో అందంగా ఉంటుంది. నేనడిగితే మీరబద్ధం చెప్పడం ఎందుకు?—నేను జెలసీ కాదని మీకు తెలుసును" అంది.

"అది నిజం."

"అబద్ధాలు నా కలవాటు లేవు. మీరు నాతో అబద్ధాలాడితే నాకు కోపంకాక, ప్రేమ రావాలా?"

"సారీ—నీ దగ్గిర ఆమెని ప్రశంసించడం బాగా అనిపించలేదు నాకు...."

మరో పదినిముషాలలో నాకు నిద్ర రాబోయింది.

"ఎల్లుండి రజని వొస్తూంది."

"ఎక్కడికి?"

"ఇక్కడికొక్కాదు. ఇంటికి—ఢిల్లీ."

"గుడ్."

"నన్ను రమ్మని ఫోన్ చేశారు నాన్నగారు."

"నువ్వేమన్నావు?"

"తరువాత చూస్తానన్నాను."

"వెరిగుడ్."

"రేపు డీలక్స్ బస్‌లో—"

"ఏమిటీ?"

"వెడతాను."

"ఎందుకింత హఠాత్తుగా మార్పు?"

"మీకు బుద్ధిచెప్పటానికి. ఈసారి మీకు బుద్ధివచ్చేదాకా నేను రాను....నాన్నగారితో కలకత్తా వెడతాను."

ఆమె నిజంగానే నిశ్చయించుకుంది. ఆ గొంతుకలో ఎక్కడా నటన లేదు. ఆమె వెళ్ళిపోతే ఎలాగ ఉంటుందో తెలుసును. కిందటి

సారి ఆమె పదిరోజులు వెళ్ళిపోయేసరికి ఎంత బాధపడ్డానో జ్ఞాపకం ఉంది.

అంచేత, ఆశగా కాకపోయినా, సిన్సియర్‌గా, "ఒకమాట విను సుజాతా!" అన్నాను.

ఆమె సమాధానం ఇవ్వలేదు.

"నేనుచేసినది తప్పేనని అంగీకరిస్తున్నాను. గీత అంత చక్కటి అమ్మాయిని చూడలేదు. ఆమె ఎంతో తియ్యగా మాట్లాడుతుంది...."

"సాయంత్రంనించీ ఆమెదగ్గర కూర్చుని నన్ను మరిచిపోయారా, లేదా?" ఒక్కసారి జీవంవొచ్చింది సుజాత గొంతుకలోకి.

కొంచెం చిక్కుప్రశ్న ఇది. నిజం చెప్పేస్తే....

ఆలోచన ఆపి, "పూర్తిగా మరిచిపోలేదనుకో....కాని—" నసిగాను.

"బాగా జ్ఞాపకం రాలేదు నేను—ఏం?"

"అవును" అన్నాను నీరసంగా.

"అందుకే మీకు బుద్ధిచెప్పాలి—పెళ్ళిముందర మీరుచేసిన వాగ్దానాలూ, పెళ్ళిలో చేసిన ప్రమాణాలూ అన్నీ మరచిపోయారన్న మాట!"

ఆరోజులు జ్ఞాపకం వచ్చాయి...పెళ్ళిముందర....అదో చిత్రమైన కథ.

"అందుకే మీరు అబద్ధాలాడతారని అన్నాను. పడుకోండి, నాకూ నిద్రవొస్తుంది, రేపు బస్సులో వెళ్ళాలి."

నా గొంతుక్కి నేనే పాశాల్ని బిగించుకున్నవిధం గురించి ఆలోచించి చివరి ప్రయత్నంగా, "నన్ను బాధపెట్టాలనేగా నీ ఉద్దేశం?" అన్నాను.

ఆమె పూర్తిగా నావైపు తిరిగి తియ్యగా "అవును" అంది.

ఈమెలో సెంటిమెంటు పూర్తిగా లేదు.

"ఐతే. నువ్వు వెళ్ళిపోడంకన్న ఇక్కడే ఉండి...."

"ఆ....మీతో మాట్లాడకుండా, మీకు దూరంగా ఉండాలి. ఏం!"

"అవును" అన్నాను తేలికపడి.

ఆమె లైటువేసి నా ముఖంలోకి చూస్తూ "నేనూ ఆలోచించాను....కాని, నాకు చేతకాదు అలాగ చెయ్యడం, అదీకాక మీకు నామీద ప్రయోగించే వెయ్యిమోసాలు తెలుసును" అంది.

"ప్రామిస్ చేస్తాను."

"మీ ప్రామిస్‌లు మీ నిజాలకన్నా అన్యాయం!" అంది.

"దీపం తీసేయ్!"

మళ్ళీ చీకటి.

"రేపు టికెట్ దొరకదు నీకు!"

"ఏర్పాటు చేశాను, మాథుర్ ఇంటినించి వాళ్ళ తమ్ముణ్ణి పంపించి." ఇక లాభంలేదని ఊరుకున్నాను.

నిద్ర పట్టబోతుంటే "మీ శిక్ష ప్రారంభం అయేది రేపటి నించి" అంది సుజాత. నిద్ర చాలా తొందరగా పారిపోయింది,

మర్నాడు డీలక్స్‌లో వెళ్ళిపోయింది సుజాత. రాత్రి కేంప్ నించి వొచ్చేసరికి అర్ధరాత్రి ఐపోయింది. ఎలాగో ఉంది ఇల్లంతా. చాలాసేపు చదివి పడుకున్నాను.

వారం రోజులదాకా ఆమె దగ్గరనించి ఏ వార్తా రాలేదు. ఆమె టెలిఫోన్ చేస్తుందని అనుకున్నాను. చాలాసార్లు నేనే రింగ్‌చేద్దామని అనుకున్నాను. కాని—ఏదో నాలో ఉన్నకోపం అడ్డువొచ్చింది. అన్యాయంగా ఆమె నేరం నామీదపెట్టి వెళ్ళిపోయిందనే నమ్మకం నన్ను ఓడిపోనివ్వలేదు.

ఆదివారం సాయంత్రం తాజ్‌మహల్‌కి వెళ్ళేను—లాన్స్‌లో కూర్చున్నాను చల్లగా ఉన్నా.

అక్కడ కనిపించేరు- మాథుర్, పిల్లలు, గీత, శ్రీమతి మాథుర్ షికారువొచ్చి.

మాథుర్ పలకరించి, "ఏమిటి విశేషాలు? సుజాత రాలేదా?" అన్నాడు.

"హల్లో!" అంది గీత, ఎంతో అందంగా.

"హల్లో" అని, "సుజాత ఢిల్లీ వెళ్ళింది" అన్నాను.

పిల్లలు ఆడుకుంటున్నారు దూరంగా పోయి.

"తెలుసును. రాలేదా?" అన్నాడు మాధుర్.

"లేదు. నువ్వెక్కడికి వెళ్ళేవు?"

"కాన్పూర్ వెళ్ళేను. ఒంటరిగా తోస్తుందా?"

"ఆయనకి పుస్తకాలు స్నేహితులు" అంది గీత.

నవ్వి, "గడుపుకోవాలి కదా!" అన్నాను.

"ఎప్పుడు వొస్తారు సుజాత?" అని అడిగింది శ్రీమతి మాధుర్.

"తెలీదు" అన్నాను.

వాళ్ళిద్దరూ నవ్వేరు; గీత నవ్వలేదు.

"అక్కడికిరా—డిన్నర్ తీసుకుని వెడుదూగాని" అన్నాడు మాధుర్.

"రేపు వొస్తాను—సెలవుకూడా" అన్నాను.

"రెండు రోజులూరా!" అని, బలవంతంగా తీసికెళ్ళాడు మాధుర్.

భోజనాల దగ్గర అతనూ శ్రీమతీ కలిసి నాచేత కొంత నిజం చెప్పించేరు. ఆమె కోపగించి వెళ్ళిపోయిందని అంగీకరించక తప్ప లేదు.

"వెళ్ళి తీసుకురండి" అంది శ్రీమతి మాధుర్.

"ఆమెరాదు."

"ప్రయత్నించండి.....ఎప్పుడో రాకతప్పదు గదా!"

అంత సుళువుకాదని బయటికి అనలేదు నేను.

"నేనో ఉపాయం చెప్తాను బ్రదర్, అలాగ చెయ్యి" అన్నాడు మాధుర్.

"ఏమిటి?"

"డాక్టర్.కుమార్‌ని అడిగి ఏదైనా జబ్బు తెచ్చుకో."

"లాభంలేదు—ఆమె నమ్మదు"

"డాక్టర్‌కి నేను చెప్పి టెలిఫోన్ చేయిస్తాను. కాజువల్ లీవ్ ఉందా?"

"ఆఁ."

"ఎంత?"

"పన్నెండు రోజులూ ఉంది."

"గుడ్. ఇరవైయో తారీకునించి ఆఫీసుకి వెళ్ళకు - మిగిలినది నేను చూస్తాను."

మొదట హాస్యంలాగ వున్నా కొంత ఆలోచన తరవాత ఈ పథకంలో కొంత ఆశ కనిపించింది. ఆమె ఎలాగైనా వొస్తే చాలు ననే బాధలో, ఈ పథకంలో అధర్మం ఏమీకనిపించలేదు నాకు. మంచి ఉపాయంగా తోచింది.

ఆ రాత్రి ఇంటికి వెళ్ళేసరికి సుజాతనించి ఫోన్ వొచ్చింది.

"ఎప్పుడు వొస్తావు?" అన్నాను, ఆమె క్షేమ సమాచారా లవగానే.

"నాన్నగారితో కలకత్తా వెళ్ళాలి."

"ఎందుకని?—ఈ శిక్ష ఎన్నాళ్ళు?"

"టెలిఫోన్‌కి చాలా ఖర్చుఔతూంది. అ మాటలకేంగాని, కలకత్తా వెడితే మీకు అభ్యంతరం ఉందా?" అంది సుజాత.

"విచిత్రంగా అడుగుతున్నావు!"

"నాన్నగారు—మీ అనుమతి తీసికోమన్నారు."

'చాలా మంచివారు!' అనుకుని, "అనుమతిలేదు సారీ!" అన్నాను.

"థాంక్స్" అని రిసీవర్ కిందని పెట్టేసింది సుజాత.

మర్నాడు కొంచెం బద్ధకంగా అనిపించి చాలా సేపటివరకూ లేవలేదు. కొంచెం తలనొప్పి, కళ్ళు మండడం....

ఆశగా టెంపరేచర్ చూసుకున్నాను.

నార్మల్.

థర్మామీటర్ మీద కసికొద్దీ విసిరేశాను. స్నానంచేసేసరికి ఎన్నడూ లేనంత ఆరోగ్యంగా ఉంది. ఆరోగ్యం అంటే అసహ్యం వేసింది,

బుధవారం ఉదయం మాథుర్ వొచ్చి. "నీకు మరీ వొంట్లో

బాగాలేదు బ్రదర్! ఇల్లు కదలకు. డాక్టర్ వొస్తాడు రెండు గంటలకి. తిరక్కు" అని హెచ్చరించి వెళ్ళేడు.

డాక్టర్ వొచ్చి, పరీక్షచేసి, కోపంగా, నిస్పృహగా, "ఏమీ లేదు మీ వొంట్లో!" అన్నాడు. కొంచెం బాధగాకూడా అన్నట్లని పించింది.

"సారీ డాక్టర్!" అన్నాను.

ప్రిస్క్రిప్షన్ రాసి, "టానిక్ కూడా రాశేను. అది తాగి మిగిలి నవి మాయంచేస్తే ఉత్తమం" అని, వెళ్ళిపోయాడు డాక్టర్. అతనంటే జాలివేసింది.

నాలుగురోజు లెలాగో గడిచాయి. పగలంతా ఇంట్లో కూర్చుని ఆఫీసుపన్లు చూడడం; సాయంత్రం ఏ సినిమాకో వెళ్ళి క్లార్క్ షిరాజ్‌లోనో, క్వాలిటీలోనో భోజనంచేసి రావడం.

చాలాకాలం ఐపోయింది సుజాత వెళ్ళిపోయి....రోజురోజుకీ ఆమె దగ్గరలేని బాధ ఎక్కువౌతోంది. మాథుర్ ఏం ఏర్పాటు చేశాడో, ఆమెకి నా 'ఆరోగ్య' పరిస్థితి తెలిసిందో లేదో నాకు తెలీదు. అతను అలహాబాద్ వెడుతూ వొచ్చి, "అన్ని ఏర్పాట్లూ చేశాను. బ్రదర్! వారం రోజుల్లో సుజాతతో ఉంటావు. ఆమె వొచ్చేసరికి కాస్త గెడ్డం పెంచి, రెండు రోజులు భోజనం బాగా తగ్గించు!" అన్నాడు.

అస్తమానం ఇంట్లో కూర్చోలేక ఈ పనులేవీ చెయ్యలేదు నేను. కాని, సుజాత ఎంత ప్రయత్నించినా నా ఆలోచనల్లోంచి వెళ్ళడంలేదు.

ఆ సాయంత్రం నిరాశ చేసుకుంటూంటే గీత వొచ్చింది.

ఆహ్వానించాను. డాయింగ్ రూములో కూర్చున్నాము. ఆమె నాలుగు పుస్తకాలు తెచ్చి ఇచ్చింది. ధన్యవాదాలు చెప్పేనేగాని, ఆమె మీద కొంత కోపంగా ఉంది. నా ఈ పరిస్థితికి అంతా ఆమే కారణం.

"వొంట్లో ఎలాగ ఉంది?" అంది గీత.

"బాగానే ఉంది...."

"అలా అనకూడదు——" నవ్వింది గీత.

కొంతసేపు ఆమె అమెరికా అనుభవాల్ని గురించీ, నా పరిస్థితుల్ని గురించీ మాట్లాడి, టీ తాగేక, "ఒకమాట అడుగుతాను, క్షమిస్తారా?" అంది గీత.

"ఏమిటి?"

"సుజాతకీ మీకూ పోట్లాట ఎందుకని వొచ్చింది?"

ఏం అనాలో తెలీక, "పోట్లాట కాదనుకోండి....వాదోపవాదాలు...."

"దేన్ని గురించి?"

'మీ గురించి' అని చెప్పలేక, నవ్వి, "సంసారంలో తొలి బాంధవి, ప్రియశత్రువూ....ఆమెకి నాతో వాదించడానికి లక్ష విషయాలు" అన్నాను తేలిగ్గా.

"ఆ రోజు, ఏ విషయం?"

నెమ్మదిగా టీ కలుపుకుని, "చెప్తే మీరు నమ్మరు" అన్నాను.

చిరునవ్వుతో, "ప్రయత్నించండి" అంది గీత.

"కారుకి కొత్త బేటరీ వేయించమంది....నేను అక్కర్లేదన్నాను. దానిమీద పెద్ద ఆర్గుమెంటు ఐపోయింది—వాళ్ళ సిస్టర్ కూడా ఢిల్లీ వొచ్చింది....అన్నీ కలిసివొచ్చాయి."

"నిజంగా?"

"మీరు నమ్మలేరని ముందరే చెప్పేనుగా!"

"అదికాదు లెండి."

మరి కొంచెంసేపు కూర్చుని, వెళ్ళిపోయింది గీత.

ఆరాత్రి మరీ చికాకనిపించింది. నేనే ఫోన్‌చేద్దామని రెండుసార్లు డయల్‌చేశాను; కాని ఎంగేజ్డ్ సిగ్నల్.

మర్నాడు ఫోన్‌చేసింది సుజాత.

"ఎలాగ ఉన్నారు?"

"బాగాలేదు."

"ఏంచేత?"

"నువ్వులేవు—అంచేత."

నవ్వుతోంది సుజాత—ఢిల్లీలో కూర్చుని.

"మందు తీసుకుంటున్నారా?"

"ఆఁ...."

"ఇంజక్షన్లు?"

"ఇంకాలేదు."

"థాంక్ గాడ్! ఎంత సీరియస్‌గా వుందో అని భయపడ్డాను."

"వొచ్చిచూడు."

"అక్కర్లేదు. మీ అసలు వ్యాధి ఇంకా కుదరలేదు అని తెలిసింది. కుదరగానే వొస్తాను."

"ఏమిటి నువ్వనేది?" అన్నాను కంగారుగా.

"గాభరా పడకండి....మీరు ఒకటోరకంగా వున్నారని నాకు తెలుసును....షిరాజ్‌లో డిన్నర్స్ బాగున్నాయా?"

"........................"

"మీకు అబద్ధాలు ఎక్కువౌతున్నాయి. అంటే-నా మందు ఇంకా పని చెయ్యలేదన్న మాట....మీ దొంగ వ్యాధికి నాకు బెంగలేదు. బై...."

"ఆగు——మాట విను" అన్నాను.

"బై...."

రిసీవర్ వొదిలి నుదుటికి పట్టిన చెమట తుడుచుకుని ఆఫీసుకి బయలుదేరేను. మిగిలిన రోజుల సెలవు కాన్సిల్ చేసి మళ్ళీ మామూలు దినచర్య ప్రారంభించేను. ఆమెకి నిజం ఎలాగ తెలిసిందో కాని, ఈ సారి అబద్ధంతో పట్టుపడ్డానన్న సిగ్గుతో ఇంక ఇలాటి 'ప్లాన్స్' వెయ్యకూడదనే నిశ్చయం చేసుకున్నాను.

మర్నాడు మాధుర్ ఫోన్ చేసేడు.

"ఆమెని మోసం చెయ్యడం నా కిష్టంలేదు" అన్నాను అతని ప్రశ్నలకి జవాబుగా.

"గీత రేపు వెళ్ళిపోతోంది....నువ్వు ఇవేళ డిన్నర్‌కిరా" అన్నాడు మాధుర్. నేను అంగీకరించాను.

ఆ రాత్రి చాలా బాగా గడిచిపోయింది. అర్ధరాత్రి దాటాక

వొచ్చి పడుకున్నాను- నిద్రపోబోతూంటే జ్ఞాపకం వొచ్చింది ఆ నాలు గైదు గంటల్లోనూ గీతతో ఎక్కువ మాట్లాడలేదని.

గర్వంగా కళ్ళు మూసుకున్నాను.

మరో నాలుగు రోజుల తరవాత కాలం గడవడమే దుష్కరం అయిపోయింది. మా కలహం మరీ సిల్లీగా కనిపించింది. సుజాత నాకోసం బాధపడుతోందని నాకు తెలుసును- నేను కొంత పొరపాటు చేశాననీ నాకు తెలిసివచ్చింది.

ఆదివారం ఉదయం ఢిల్లీ వెడదామని నిశ్చయించుకున్నాను. ముఖాముఖీగా ఆమె నన్ను కాదనదు....అదీకాక వాళ్ళ నాన్నగారిమీద గురి యెక్కువ. ఆయన నా పక్షం....

రెండు రోజు లెలాగో గడిపాను. ఫోన్ చెయ్యలేదు, ఆమెకు నోటీసు ఇవ్వడంలో నష్టం గమనించి—

ఐదు గంటలకి లేచి, ఇరవై నిమిషాల్లో తయారై, స్టేషన్‌కి ఐదున్నరకి చేరుకున్నాను. వెళ్ళేసరికి జి. టి. మూడునందల నిమిషాల లేటని టికెట్ కొన్నాక తెలిసింది.

మళ్లా ఇంటికి చేరుకొని కాఫీ తాగి నిద్రపోయాను. లేచేసరికి పది అయిపోయింది.

హడావుడిగా స్టేషన్ చేరాను. ప్లాట్‌ఫారమ్‌మీదికి ఢిల్లీనించి సిల్వర్ ఆరో వొస్తూంది. జి. టి. ఇంకో అరవై నిమిషాలు (గంట అని అనరు రైల్వేవాళ్ళు) దాటాకగాని రాదని తెలిసింది.

ప్లాట్‌ఫారమ్‌మీద పచారు చేస్తూ సిగ్నల్ ఆరో వొస్తూంటే చూస్తున్నాను.

చాలామంది టూరిస్టు్సు దిగేరు. అటూ ఇటూ చూస్తూంటే ఒక కంపార్ట్‌మెంట్‌లోంచి దిగుతూ సుజాత కనిపించింది. క్షణమాత్రం ఆశ్చర్యపడి తొందరగా వెళ్ళి పలకరించేను.

తెల్లబోయి-"మీ కెలాగ తెలిసింది నేను వొస్తున్నానని?— నాన్నగారు ఫోన్‌చేశారా?" అంది సుజాత

"లేదు- ఎవరూ ఫోన్ చెయ్యలేదు" అని సామానులు పోర్టర్‌కి

ఇచ్చి, ఆమెని బయటికి తీసుకొచ్చాను. కారు స్టేషన్‌లోనే ఉంది, డ్రైవర్ నాకోసం ఎదురు చూస్తూండడంవల్ల.

ఇంటికి చేరగానే టీ తాగి, "నిజం చెప్పండి- నేను వొస్తున్న సంగతి మీ కెలాగ తెలిసింది?" అంది సుజాత.

"అప్పుడే నిజం మాట ప్రారంభించావు" అన్నాను.

"చెప్పండి."

"నమ్మవు."

"చెప్పండి."

"ఇవేళ నువ్వు వస్తావని ప్రిమానిషన్....బహుశా నిన్ను గురించి తప్ప ఆలోచించక పోవడంవల్ల ననుకుంటాను."

"చిత్రంగా వుంది!"

"నువ్వు నమ్మవని చెప్పేనుగా!"

సుజాత ఢిల్లీ డయల్‌చేసి నా మాటలని నిజం అని తెలుసుకుని, "క్షమించండి. పొరపాటున ఇంకా అబద్ధం ఆడుతున్నారను కున్నాను....ఎంత బాగుంది" అంది, ఎంతో తియ్యగా నా కళ్ళల్లోకి చూస్తూ.

దగ్గరగా తీసుకోబోయాను.

"శిక్ష ముగిసినట్లేనా?" అన్నాను, ఆ క్షణంలో ఆమెలో వొచ్చిన భావతరంగాల మీద ఆశపెట్టుకుని.

"అదే ఆలోచిస్తున్నాను...."

ఆ చక్కటి క్షణాన్ని టెలిఫోన్ పాడుచేసింది. ఎవరో రాంగ్ నంబర్ డయల్ చేశారు. ఆ మధురక్షణం రాంగ్ నంబర్‌లో కరిగి పోయింది.

*　　　　*　　　　*

రాత్రి భోజనాలయాక హీటర్ దగ్గర కూర్చున్నాం. ఆమె చాలా ప్రశాంతంగా, ప్రేమమూర్తిగా కనిపిస్తోంది నాకు.

"ఆ టానిక్ పూర్తిగా తాగలేదేం?" అంది.

"అవసరంలేక-సరేకాని- నా సిక్‌నెస్ గురించిన విషయం నీ కెలాగ తెలిసింది?" అన్నాను.

"ఆ తరవాత కూడా మీరు అబద్ధాలు మానలేదు" అంది నవ్వుతూ సుజాత.

"మానేశాను...."

"అయితే, మనం బేటరీ గురించి దెబ్బలాడుకున్నాం అని గీతతో ఎందుకు చెప్పేరు?"

హీటర్ ఒక్కసారి చల్లబడిపోయి నట్లనిపించింది.

"గీత...."

"ఆc....మీ సిక్‌నెస్ గురించిన నిజం అలాగే తెలిసింది.... ఏమనుకున్నారు?"

ఆమె ఎంతో మృదువుగా, చెదిరిపోయిన నా ఆలోచనల్ని మెత్తగా సరిదిద్దుతూ అంది. నా ముందరి నేరాలకన్న ఈ నేరాలు పెద్దవి. కాని....ఆమెలో కోపంలేదు!

ఏమీ అనలేకపోయాను.

"సిగరెట్ కావాలా?"

ఆమె లేచి వెళ్ళి కోటు జేబులోనించి నా సిగరెట్ పేకెట్టూ, లైటరూ తెచ్చి ఇస్తూ, "ఇదేమిటీ?" అంది.

చూశాను-భగవాన్!

ఉదయం కొన్న టికెట్ జేబులోనే ఉండిపోయింది! ఆమె పరీక్షగా చూసి టేబిల్‌మీదని పడేసి అలాగే నిలబడింది.

చాలాసేపు ఎవరమూ మాట్లాడలేదు. నా కొత్త అసత్యం ఇలాగ బయటికి, ఇంత తొందరగా వొస్తుందని అనుకోలేదు నేను.... నా ప్రిమానిషన్‌లో, నా మనసు నిండిపోయిన ప్రేమలో నమ్మకం పెట్టుకుని ఆనందించిన సుజాతకి ఏమని చెప్పేది?

సిగరెట్ వెలిగించుకున్నాను - ఆ శిథిల స్వప్నాలకి స్వస్తి చెప్తూ.

ఆమె కొద్ది క్షణాల తరువాత వొచ్చి నా పక్కన కూర్చుని "ఏమిటి ఆలోచిస్తున్నారు?" అంది.

"సారీ!" అన్నాను.

"దేనికి?" అంది సుజాత

"అబద్ధాలకి" అన్నాను టికెట్ వైపు చూస్తూ.

నా చేతులు తన చేతుల్లోకి తీసుకుంది లాలనగా, సుజాత. సిగరెట్ పారవేసి ఆమెని దగ్గరగా తీసుకున్నాను.

"నేనే సారీ చెప్పాలి"....అంది సుజాత.

ఆశ్చర్యంగా చూశాను.

"అవును. మీరా అసత్యాలన్నీ ఎందుకు చెప్పేరో కొంచెం ఆలస్యంగా తెలిసింది నాకు...."

వింటున్నాను.

"ఉదయమే చూశాను మీ జేబులో టికెట్."

"నా అబద్ధాలు—"

"జీవితానికి పూసే చక్కటి రంగులు-అవి అవసరంలేని జీవితం ఉండదు. ఏం?"

ఆమె చాలా దగ్గరికి వొచ్చింది. జవాబు చెప్పే ప్రయత్నం చెయ్యలేదు నేను.

బయట చాలా చలిగా ఉంది.